
ప్రజాశక్తి
సోమవారం 8 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీల నమోదు

ప్రజాశక్తి -పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ ఎస్) లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించనున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అక్రమ రికవరీలు, సస్పెన్షన్ల విధింపు ఆపాలి
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం



ఫీల్డ్ అసిస్టెంట్ల మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ వేధింపులు నిలిపివేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్ల ప్రథమ జిల్లా మహాసభ మండింగి హరినాథ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఇటీవల సోషల్ ఆడిట్ పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్లను మానసికంగా ఆర్థికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, వేతనదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా చిన్న చిన్న సాంకేతిక కారణాలు చూపించి లక్షల్లో రికవరీలు, సస్పెన్షన్లు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత 20ఏళ్లుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించకుండా మేన్ డేస్ పేరుతో ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. రికార్డులు, పేపర్లు, స్టేషనరీ ఖర్చులు ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్లపై భారం వేయడం సమంజసం కాదన్నారు. ఏడు రికార్డులకు రూ.50వేలు ఖర్చు అవుతున్నదని, ఫీల్డ్ అసిస్టెంట్లు చేయకూడని యాప్ పని కూడా వారితో చేయిస్తున్నారని చెప్పారు. అనేకమంది ఉన్నత చదువులు చదివిన వారికి కేవలం రూ.5740 వేతనం ఇచ్చి జీవితానికి ఎలాంటి భరోసా లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే డిసెంబరు 31, జనవరి1,2,3,4 జరగనున్న అఖిల భారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకట్రావు, సింహాచలం, తులసి, సంగం నాయుడు, ఆదినారాయణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమరోత్సాహం

- ఘనంగా సిఐటియు జిల్లా మహాసభ ప్రారంభం
- రాజాంలో భారీ ప్రదర్శన



రాజాంలో కార్మికుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, రాజాం

సిఐటియు 11వ జిల్లా మహాసభ ఆదివారం సమరోత్సాహంతో ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు, కర్షకులు ఎర్రజెండాలు చేబూని రాజాం పట్టణంలో కదం తొక్కారు. రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బొబ్బిలి రోడ్డు మీదుగా చీపురుపల్లి రోడ్డులోని శ్రీసాయి నటరాజ్ కల్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన మహాసభ వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా కదలివచ్చిన కార్మికవర్గ సమర నినాదంతో రాజాం మెయిన్‌రోడ్డు మార్మోగింది. ఎరుపు జెండాలు, అలంకరించిన తోరణాలతో రోడ్డంతా ఎర్రబారింది. ఎర్ర జెండాలతో 11 మంది మహిళా కార్మికుల కవాతు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కలయిక, పరస్పర కరచాలనాలతో మహాసభ ప్రాంగణం ఎంతో సందడిగా కనిపించింది. 'వర్థిల్లాలి కార్మికుల ఐక్యత, రైతులకు యూరియా అందుబాటులోకి తేవాలి, లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, తదితర స్కీమ్ వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి' అంటూ ప్రదర్శనలో కార్మికులంతా ఏకోన్ముఖంగా చేసిన నినాదాలతో రాజాం పట్టణం దద్ధరిల్లింది. ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ అగ్రభాగాన నిలిచారు. ప్రతినిధుల సభకు ముందు మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిఐటియు పతాకాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజాం ఐసిడిఎస్ ప్రాజెక్టు నాయకులు రూప ఆవిష్కరించారు. మహాసభ జరిగిన ప్రాంతానికి సిపిఎం జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి, కీర్తిశేషులు సీతారాం ఏచూరి నగర్‌గాను, మహాసభ వేదికకు సిఐటియు నేత, కీర్తిశేషులు విజికె మూర్తి ప్రాంగణంగాను నామకరణం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ప్రతినిధుల సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్.. గడిచిన మూడేళ్ల పోరాటాలు, విజయాలు, సిఐటియు ఎదుర్కొన్న సవాళ్లు సహా కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై రాత్రి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించారు.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

బ్యాంకు రుణానికి మంత్రి అనుచరుడు బ్రేక్

- లబోదిబోమంటున్న మహిళా సంఘం సభ్యులు
- మంజూరుకు అనుమతివ్వని వెలుగు అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా కానరాని ఫలితం

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికారం, అహంకారం కలిస్తే ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా విచక్షణ లేకుండా వ్యవహరిస్తాడు. తాను ఏం చేయకూడదో, ఏం చేయాలో తెలియని స్థితిలోకి వెళ్లి తప్పుడు పనులు చేస్తుంటాడు. ఇలాంటి చిల్లర పనులు చేయడం వల్ల ఆయన పని చేస్తున్న రాజకీయ పార్టీకి, నమ్ముకున్న నేతకు చెడ్డ పేరు వస్తుందని తెలిసినా అధికారం, అహంకారం అలాంటి పనులనే చేయాలని ఉసిగొల్పుతాయి. నియోజకవర్గ పరిధిలోని పాచిపెంట మండలం మోసూరులో టిడిపికి చెందిన ఓ చోటా నాయకుడు చేసిన చిల్లర పనికి ఆ పార్టీ కార్యకర్తలే ఉమ్మేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ముఖ్య అనుచరుడైన గ్రామ నాయకుడొకరు ఆ గ్రామానికి చెందిన వరలక్ష్మి మహిళా సంఘానికి మంజూరు కావాల్సిన బ్యాంక్ లింకేజీ రుణాన్ని అడ్డుకున్నారు. మండలానికి చెందిన వెలుగు ఎపిఎం, సిసిలపై ఒత్తిడి పెంచి రుణం మంజూరుకు బ్రేక్ వేశారు. ఆ సంఘంలో ఉన్న 11మంది మహిళల్లో 9మంది టిడిపి సానుభూతిపరులే. అయినా ఆ చోటా నాయకుడు బ్యాంక్ రుణం మంజూరు కాకుండా తన తడాఖా చూపిస్తున్నారు. బ్యాంకు నుంచి ఎప్పటికప్పుడు లింకేజ్ రుణాన్ని తీసుకుంటూ సకాలంలో చెల్లిస్తున్న ట్రాక్ రికార్డ్ ఆ సంఘానికి ఉంది. దీంతో బ్యాంక్ అధికారులు కూడా వారికి ఐదో విడత రుణం మంజూరు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంఘంలో సభ్యురాలైన పట్నాన గోవిందమ్మ గ్రామంలో లేకపోవడం, వలస వెళ్లిపోవడంతో మిగిలిన సభ్యులతో సహకరించడం లేదు. ఈ కారణం చేత పట్నాన గోవిందమ్మను సంఘం నుంచి తొలగిస్తూ సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. జూలై 5న సంఘం తీర్మానం చేసి బ్యాంక్ లింకేజ్ రుణం కోసం బ్యాంక్‌లో సభ్యులంతా ఇకెవైసి కూడా వేశారు. అయితే సంఘం చేసిన తీర్మానంపై గ్రామానికి చెందిన వెలుగు సిసి, ఎపిఎం సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ సంతకాలు చేయకుండా వెలుగు అధికారులపై చోటా టిడిపి నాయకుడు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారి అవసరాల కోసం తీసుకోవాల్సిన రుణం నిలిచిపోయింది. జూలై 21న మహిళా సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేశారు.


రుణానికి నోచుకోని మహిళా సంఘసభ్యులు

ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘం సభ్యులు ఆవేదన చెందుతున్నారు. మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఆ చోటా నాయకుడు సొంత పార్టీకి చెందిన మహిళా సంఘానికి రుణం మంజూరు కాకుండా అడ్డుకోవడం చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి నాయకుల వల్ల మంత్రికి, పార్టీకి చెడ్డ పేరు వస్తుందని గ్రామానికి చెందిన మహిళలు వాపోతున్నారు. మరోసారి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడు చెప్పుకోవాలని వారు భావిస్తున్నారు.

మహిళలకు వరం.. 'స్త్రీశక్తి' : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు రూరల్


సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

స్త్రీ శక్తి పథకం యావత్ మహిళా జాతికి కూటమి ప్రభుత్వం అందజేసే గొప్ప వరమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన మహిళలతో కలిసి స్థానిక ఆర్‌టిసి కాంపెక్స్ నుంచి వేణుగోపాల స్వామి కోవెల వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, సాంఘిక శక్తివంతం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం వేలాది మహిళలకు మేలుచేస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు పొందే సౌలభ్యం కలుగుతుందని, స్వయం ఉపాధి అవకాశాలు పొందేందు వీలుంటుందని అన్నారు. చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు, కృషి ఆధారిత రంగాలు, సేవా రంగం మొదలైన విభాగాల్లో మహిళలకు ఉపాధి మార్గాలు సృష్టించబడుతున్నాయన్నారు. స్త్రీ శక్తి పథకం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఇది మహిళల ఆత్మగౌరవానికి, విశ్వాసానికి ప్రతీకని, భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేసే శక్తి మహిళల్లో ఉందని నమ్మకంతో ఈ పథకం రూపొందించబడిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిఐకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి విశాఖ సిటీకి బదిలీపై వెళ్తున్న ఎం.చంద్రమౌళికి ఆదివారం స్థానిక రమా సత్యనారాయణ కల్యాణమండపంలో ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.రాంబాబు మాట్లాడుతూ చంద్రమౌళి ఇక్కడ ఎస్‌ఐగానూ, సిఐగానూ పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఇక్కడి ప్రజలతో మంచి సత్సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. బదిలీపై వెళ్తున్న సిఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎస్సైలు ప్రయోగమూర్తి, కళాధర్, అమ్మినాయుడు, అప్పారావు తదితరులు ఉన్నారు.

రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు


రణభేరిని విజయవంతం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆర్థిక విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మన్యం జిల్లా యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రశాంతంగా పాఠాలు చెప్పే వాతావరణం లేదని, దీనికి కారణం ప్రభుత్వం అనుసరించే విధానాలేనని ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు విమర్శించారు. తక్షణమే ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఒత్తిడి లేకుండా పాఠశాలలో పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, తక్షణమే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి ఆర్థిక బకాయిలు పేరుకుపోయాయని, వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ ఉన్న డిఎలను విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమిషనర్‌ను వెంటనే నియమించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్రాన్ని ఐదు ప్రాంతాలుగా తీసుకొని రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల్లో చైతన్యాన్ని కలిగించి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సమస్యలు పరిష్కరింపజేయాలని ఆశిస్తున్నామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించిన పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని యుటిఎఫ్ నాయకులు హెచ్చరించారు. అనంతరం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎన్.శ్రీనివాసరావు, కె.కృష్ణారావు, బి.కూర్మారావు, ఎం.శంకర్రావు, బి.రామకృష్ణ, ఎన్.శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధుసూదన రావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.వెంకటనాయుడు, అన్ని మండలాల యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించండి

ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విజయవాడలో శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని ప్రజలంతా ఖండించాలని వామపక్ష, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సుందరయ్య భవనం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ విజయవాడలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన జరిగిన ఆందోళన కార్యక్రమాన్ని పోలీసులు పాశవికంగా అణిచి వేయడాన్ని ఖండించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, బోధనా సిబ్బంది, బోధ నేతర సిబ్బంది పూర్తిస్థాయిలో అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో, కళాశాలలో నియమించాలని కోరారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విద్యార్థులకు విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టానుసారం పెంచుతున్న ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ చేసిన ఆందోళనపై పోలీసులు లాఠీఛార్జీ చేయడం అమానుషమని చెప్పారు. దొరికిన వారిని దొరికినట్లు చిన్నపిల్లలని కూడా చూడకుండా వాహనాల్లో కుక్కి పడేశారని, ఆడపిల్లలని కూడా చూడకుండా చున్నీలు లాగివేశారని అన్నారు. విశాఖపట్నం విద్యార్థినికి చెయ్యి విరిగిందని, అనేకమందికి రకరకాల గాయాలయ్యాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. దీనివల్ల పేద, మధ్యతరగతి పిల్లలకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో గత ప్రభుత్వం గానీ, ఈ ప్రభుత్వం గానీ అతి ఉత్సాహంతో అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అన్ని ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి


విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలి
జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని వెలుగు విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విఒఎల జిల్లా మహాసభ కె.కుమారి అధ్యక్షతన జరిగింది. ఈసభలో ధనలక్ష్మి మాట్లాడుతూ విఒఎల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, మెప్మాలో ఈ సర్క్యులర్‌ను రద్దు చేశారని, అదే రకంగా వెలుగు సెర్ప్‌లో కూడా సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, విఒఎలపై పని భారం పెరుగుతుందని చెప్పారు. జిల్లాలో పలు యాప్‌లు లాగిన్ చేయడం ద్వారా విఒఎలు అనారోగ్యం పాలవుతున్నారని, రాజకీయంగా వేధిస్తూ జిల్లాలో 19 మంది విఒఎలను తొలగించడం అన్యాయమని అన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. ఇస్తున్న వేతనాలు ఆరు, మూడు నెలలకు ఒకసారి చెల్లించడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగింపులు, వేధింపుల నుంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం జిల్లాలో 15 మండలాల నుంచి హాజరైన విఒఎలు కొత్త జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా కె. శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కె.ధర్మరాజు, కోశాధికారి కె.కుమారి, సహాయ కార్యదర్శిగా సుందరరావు, దేవి. ఉపాధ్యక్షులుగా డి.అరుణ, విజయ్ కుమార్‌తో పాటు మరో ఏడుగుర్ని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విఒఎ జిల్లా బాధ్యులు, సిఐటియు నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి గొర్ల వెంకట రమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడారు.

శిథిలావస్థలో ఎంఇఒ కార్యాలయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థ స్థితిలోకి చేరుకున్నాయని చెప్పడంలో సందేహం లేదు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం పెచ్చులూడుపోతున్నాయి. అలాగే ఎంఆర్‌పి భవనం, ఎంఇఒ కార్యాలయం చినుకు పడితే చాలు నీరంతా కిందకే వచ్చేయడంతో అక్కడ అధికారులకు అవస్థలు తప్పడం లేదు. అప్పటి కాంట్రాక్టరు నిర్లక్ష్య నిర్మాణాల కారణంగా ఇప్పటి అధికారులకు అవస్థలు తప్పడం లేదు. ప్రమాదకర పరిస్థితిలో భవనాలు ఉన్నప్పటికీ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. ఎంఆర్‌పి భవనం బాగోకపోవడంతో విద్యాశాఖ మెటీరియల్ అంతా వేరే పాఠశాలలో దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రద్ధ కనపర్చి భవనాలు కనీస మరమ్మతులైనా చేయాలని పలువురు కోరుతున్నారు.


ఎంఇఒ కార్యాలయంలోకి చేరిన వరద నీరు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

సీతానగరం : మండలానికి 2024 25 ఆర్థిక సంవత్సరం రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30,13,429 నిధులు విడుదలైనట్లు ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ నిధులు 35 పంచాయతీల్లోని ఆయా గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు,


నదిపై చేపడుతున్న వంతెన పనులు

శరవేగంగా వంతెన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సువర్ణముఖి నదిపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాత వంతెనపై ఎక్కడికక్కడే గోతులు పడ్డంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెన మరమ్మతు కావడంతో అప్పటి వైసిపి హయాంలో 2017లో సువర్ణముఖి నదిపై కొత్త వంతెన నిర్మాణ పనుల కోసం రూ.12 కోట్ల 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ పనులు ప్రారంభంలోనే కాంట్రాక్టరు చేయకపోవడం అప్పటి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీనికి తోడు ముడి సరుకు ధరలు పెరగడంతో కాంట్రాక్టు ముందుకు రాకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత 2024లో ఈ వంతెన నిర్మాణం కోసం రూ.15 కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రస్తుతం ఈ వంతెన నిర్మాణం పనులు శరవేగంతో జరుగుతున్నాయి. ఈ వంతెన 33 అడుగుల వెడల్పుతో చేస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు అంటున్నారు.

నేడు మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ గ్రామ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈనెల 8న 34వ మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు ఎం సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నామని, చుట్టూ ప్రక్కల ఉన్న గ్రామస్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరానికి వచ్చిన వారు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకురావాలన్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలను నిర్వహించాలి

ప్రజాశక్తి -కొమరాడ

ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య సిపిఎం డిమాండ్ చేశారు. కొమరాడలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో 10ప్రభుత్వ వైద్య కళాశాల లు పి పి పి పద్ధతిలో నిర్మించుటకు ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. వీటి నిర్మాణం ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి సామాన్య ప్రజలకు ప్రభుత్వ వైద్యం దూరం చేసిందని అన్నారు. కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని కోరారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల అవసరాలకు తగినట్టుగా వైద్య కళాశాలల్లో సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య మండలిపై ఒత్తిడి తేవాలన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేదల వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు గౌర్నాయుడు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించాలి

ప్రజాశక్తి - సీతంపేట

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని సోమగండి పంచాయతీ కంబగూడకు చెందినది మాజీ ఉప సర్పంచ్ నిమ్మక నారాయణరావు కోరారు. మండలంలోని కొన్ని రైతు సేవ కేంద్రాలకు మాత్రమే ఎరువులు వచ్చాయని, అవి కూడా అరకొరగా రావడంతో రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మరో పక్క. ఏజెన్సీ ప్రాంతంలో సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతం మాదిరిగా ఇప్పటికీ ఉడుపులు జరగలేదని, ఇటీవల వరుణుడు కరుణించి వర్షాలు కురవడంతో ఉబాలు మొదలు పెడదామనేసరికి ఎరువులు కొరత వెంటాడుతుందని అన్నారు. దీంతో పొరుగు మండలాలకు వెళ్లినప్పటికీ అక్కడ కూడా నో స్టాక్ బోర్డు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయట మార్కెట్లో రూ.500 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతుందని, అయినప్పటికీ ఎరువు దొరక్కపోవడంతో ఏడాది ఖరీఫ్ గట్టెక్కడం కష్టమవుతుందని అన్నారు. ఒడిశా పర్లాకిమిడి నుంచి కూడా ఇక్కడకు వస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు కావాల్సి ఎరువులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజీవ్ స్టేడియంలో టెన్నికాయిట్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలకు సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి ఎ.రామారావు ప్రారంభించారు. సీనియర్ జట్టు ఈ నెల 13, 14 తేదీల్లో మండపేటలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైపాస్‌లో భారీ గోతులు

ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల బైపాస్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఈ గుంతల్లో బైక్ బోల్తాపడడంతో పలువురు గాయాల పాలై ఆసుపత్రులో చికిత్స పొందుతున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ రోడ్డులో ఇంత పెద్ద గుంతలు ఏర్పడి ద్విచక్ర, భారీ వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులకు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డు ఇప్పుడు వాహనదారులకే ప్రమాదకారకంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరింత మంది గాయాలు పాలవ్వకుండా బైపాస్ రోడ్డును బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డును బాగుచేయించండి : సిపిఐ

బైపాస్ రోడ్డు పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కూటమి ప్రభుత్వం వచ్చినా పార్వతీపురం మన్యం జిల్లా రోడ్ల పరిస్థితి మారలేదని సిపిఐ నాయకులు ఆర్‌వివిఎస్ కుమార్ విమర్శించారు. ఆ గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉన్నా కనీసం ఆ దిశగానైనా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా బైపాస్ రోడ్డును బాగు చేయించాలని, లేకుంటే ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


భారీ గొయ్యిలో దిగబడ్డ లారీ

పడకేసిన పారిశుద్ధ్యం

- విష జ్వరాలతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలో పారిశుధ్యం పడకేసింది. శానిటేషన్ పనులు చేపట్టకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మండలంలో ఏ గ్రామంలో చూసినా విషజ్వరాలతో ప్రజలు హడలిపోతున్నారు. శానిటేషన్ పనులను చేయించడంలోనూ, పనుల పర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమమని ప్రతి మూడో శనివారం సంబంధిత మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పలు వీధుల్లో తిరగడమే తప్ప కనీసం ఆ వీధులు ఎలా ఉన్నాయో గాని ఆ వీధిలో ప్రజల అభిప్రాయం ఎలా ఉన్నదన్న విషయాలు గానీ కనీసం పట్టించుకోకపోవడం చాలా దారుణం.

మండలంలో మైదాన ప్రాంతమైనా, గిరిజన ప్రాంతమైన ఒకే విధంగా పారిశుధ్య పరిస్థితి ఉంది. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఏదో పండగ పూట గ్రామాల్లో అక్కడక్కడ కాలువలను, మురుగులను బాగు చేసి ఆ తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన లేదు. దీంతో వర్షం పడితే ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలబడడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. ఇదే విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసినా నిధుల్లేవని, వచ్చిన నిధులు చాలీచాలడం లేదని చెప్పుకొస్తున్నారు. సాలూరు ఏజెన్సీ ప్రాంతం కావడం, ఒడిశాకు దగ్గరగా ఉండడంతో గత మూడు నెలల నుంచి ప్రతిరోజు వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో ఎక్కడ గొయ్యిలు ఉంటే అక్కడ నీరు నిలబడడం, కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో మురుగునీరు సరిగ్గా ప్రవహించకపోవడం ఈ ప్రాంతాలు దోమలకు ఆవాస నిలయాలుగా తయారయ్యాయి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతూ నానా ఇబ్బందులు పడుతూ ఇంటిని, ఒంటిని గుల్ల చేసుకుంటూ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఇలాగే మరికొద్ది రోజులు గ్రామాల్లో ఉంటే కాలువలను, కుంటలను పరిశుభ్రం చేయకపోతే ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే పరిస్థితులు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో పరిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మచ్చుకైనా కనిపించని ఫాగింగ్

నెలకు ఒక్కరోజు ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయాలని అధికారులు నిర్ణయించుకున్నా ఇప్పటి వరకు ఏ గ్రామంలోనూ మచ్చుకైనా ఫాగింగ్ చేసిన దాఖలాల్లేవు. దీంతో దోమలు ఎక్కడపడితే అక్కడ స్వైర విహారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. లక్షలు ఖర్చు పెట్టి ఫాగింగ్ మిషన్లు ప్రభుత్వం కొనుగోలు చేసినా వాటిని ఉపయోగించే విధానం స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అవి మూలన చేరి ఫాగింగ్ అన్న పదం ఎక్కడా వినబడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం లేదు

మండలంలో అనేక గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసిన ప్రజలకు పరిశుభ్రమైన నీటిని ఇంటింటికి సప్లై చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఈ వాటర్ ట్యాంకును ఎప్పుడో ఏడాదికోసారి శుభ్రపరుస్తున్నారు. శుభ్రపర్చని వాటర్ ట్యాంకర్ ద్వారా వచ్చే నీటిని ఉపయోగించడం వల్ల చాలామంది విషజ్వరాలు రోగాలు బారిన పడుతున్నారు. వాటిని సక్రమంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు ప్రతిదానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, దీంతోనే కొన్ని పనులు చేయలేకపోతున్నామని వారు తెలపడంతో ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలకు, అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది.

వీధి దీపాలకు కరువే

అప్పటి టిడిపి ప్రభుత్వం 2014లో ఇచ్చిన వీధి దీపాలనే ఇప్పటికీ ఉపయోగించడం, అందులో చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. అనేక గ్రామాల్లో వీధి దీపాలను ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నా చాలా గ్రామాల్లో సగం వరకే వెలిగి మిగతావి వెలగకుండా ఉంటున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన స్థానిక జూనియర్ లైన్‌మెన్లు వీటిని పట్టించుకోవడం లేదు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో కుక్కలు, పాములతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది కుక్క కాటుకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామాల్లో వీధి దీపాలను, కాలువలను, వాటర్ ట్యాంక్ లను పరిశుభ్రపర్చి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


మామిడిపల్లిలోని కాలువలో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రతి ఏటా ఆస్పత్రికి రూ.40 వేలు ఖర్చు

నేను వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. మా ఇంటి పక్కనే కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా నీరు నిల్వ ఉండిపోవడంతో వర్షాకాలంలో మా ఇంట్లోకి వస్తుంది. ఇదే విషయమై చాలాసార్లు స్థానిక సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ఈ కాలువను ఆక్రమించి అనేక మంది షాపులు నిర్మించడంతో మురుగునీరు బయటకు పోవడంతో లేదు. దీంతో మా ఇళ్లల్లోకి ఆ నీరు వచ్చి మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురి చేస్తుంది. దీంతో జ్వరాలబారినపడి ఏడాదికి రూ.30వేలు నుంచి రూ.45వేలు వరకు మందులకు ఖర్చు అవుతున్నాయి. ఇలా అయితే మావంటి పేదవాళ్లు ఎలా బతకాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం.

కిలారి రామకృష్ణ,
మామిడిపల్లి.


జ్వరాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మురుగు నీటి నిల్వతోనే జ్వరాలు

ఇంట్లో ఉన్న వారంతా నెలరోజుల నుంచి జ్వరాలు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ వేల రూపాయిలు ఆసుపత్రులకు చెల్లిస్తున్నాం. ఇప్పటికీ జ్వరాలు తగ్గడం లేదు. కేవలం మాకు వచ్చే జ్వరాలు వీధి కాలువల్లో నీరు నిల్వతోనే వస్తున్నాయి. ఇదే విషయమై సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే ఇదిగో, అదుగో అంటూ కాలం గడుపుతున్నారు తప్ప కాలువలను శుభ్రపర్చటం లేదు. మాకు వచ్చే జ్వరాలు, కీళ్ల నొప్పులకు, ఇతర ఇబ్బందులకు కేవలం పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శిదే. కాలువల్లో పూడికలు తీయించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

బూస భాస్కర రావు,
మామిడిపల్లి.

జిరాక్స్ కాపీలే పట్టాలనుకోండి

- గిరిజనులకు తహశీల్దార్ సూచన
- నిరసన తెలిపిన బాధితులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

అటవీ హక్కు పట్టాలు మాయం చేసి జిరాక్స్‌లు కాపీలను పట్టాలు అనుకోమని సెలవిచ్చారు స్థానిక తహశీల్దార్. ఎన్నో ఏళ్లుగా కొండపోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు పట్టాలు ఇవ్వమని పలుమార్లు కలెక్టర్‌ను, ఐటిడిఎ పిఒను కోరారు. అయినా నేటి వరకు పట్టాలు ఇవ్వలేదు. కొందరికి పట్టాలిచ్చినా ఆ పట్టాలు ఆఫీసులో ఎక్కడున్నాయో కనిపించట్లేదని, వాటి తాలూకు జిరాక్స్ పేపర్‌ను పట్టాలు అనుకొండని తహశీల్దార్ గిరిజనులకు తెలిపారు.

ఇందుకు నిరసనగా మండలంలోని బొర్రపనుకు వలస గ్రామ ఆదివాసీ గిరిజనులు తమ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివారం ఆ గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాసి మాట్లాడుతూ 2021లో అటవీ భూముల పట్టాల కోసం సుమారు 35 కుటుంబాలకు సంబంధించిన భూములకు సర్వేలు నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఏళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదని అన్నారు. అనేక సందర్భాల్లో పట్టాలు పంపిణీ చేయాలని వివిధ రూపాల్లో పోరాటాలు చేయగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి, కలెక్టర్, ఐటిడిఎ పిఒ గతంలో పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కొందరికిచ్చిన జిరాక్స్ కాపీలను పట్టాలు అనుకోవాలని తహశీల్దారు ఇటీవల చెప్పారని, ఒరిజినల్ పట్టాలను మాయం చేసి గిరిజనులను మోసగించిన వారిపై చర్యలు తీసుకొని, పట్టాలు పంపిణీ చేయాలని పోరాటాలు నిర్వహించగా రెవెన్యూ కార్యాలయంలో పట్టాలు కనబడడం లేదని తెలిపారన్నారు. వీటి స్థానంలో మళ్లీ కొత్తగా పట్టాలిస్తామని చెప్పిన అధికారులు ఈరోజు వరకూ పట్టాలు పంపిణీ చేయకుండా గిరిజనులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గెమ్మెల నాగేశ్వరరావు, తాడంగి నర్సింగరావు, మెల్లిక కోమన్న, మర్రి ముగిరి, గెమ్మెల్ శ్రీను, కొర్ర సన్యాసిరావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గిరిజనులు

రూ.లక్షల్లో బకాయిలు

- జగన్నాథస్వామి ఆలయ ఆదాయానికి గండి
- ఉదాసీనత చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

దేవాదాయం శాఖకు రావాల్సిన ఆదాయానికి పలువురు పంగనామాలు పెడుతున్నారు. లక్షల్లో బకాయిలు ఉన్నా అధికారులు ఉదాసీనత చూపిస్తున్నారు. మా సొమ్మేం కాదు కదా పోతే దేవాలయశాఖ ఆదాయమే కదా అన్నరీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ ఆదాయాన్ని గండి పడుతుంది. ఆషాడ మాసంలో ప్రతి ఏటా రథయాత్ర ఉత్సవాలు జరగడం ఆనవాయితీ. అయితే ఈసారి ఉత్సవాలకు మూడు లక్షల రూపాయల వరకు ఖర్చయినట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. హుండీ ద్వారా ఉత్సవాలుకు రూ.38వేలు ఆదాయమే వచ్చింది. అయితే జెయింట్ వీల్ వేలంపాటకు రూ.3,80,000 ఖరారు చేయగా, రూ.1,50,000 మాత్రమే చెల్లించి ఆ వ్యక్తి చేతులు దులుపుకున్నాడు. గత ఏడాది కూడా జాయింట్ వీల్‌కు రూ. ఐదు లక్షలకు వేలం పాట ఖరారు కాగా, ఇప్పటికీ సుమారు రెండు లక్షల 50 వేల రూపాయల వరకు బకాయి ఉంది. ఇంత బకాయి ఉన్నప్పటికీ అధికారులు సంబంధిత వ్యక్తులపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయానికి రావాల్సిన ఆదాయం రాకుండా ఆలయ సొమ్ము హారతి కర్పూరంలా అర్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయానికి రావాల్సిన ఆదాయానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


జగన్నాథస్వామి ఆలయం


కురుపాం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 9న మంగళవారం ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి ఆధ్వర్యాన తలపెట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 9న అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నామని, కావున రైతులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. కార్గిల్ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, పాలకొండ వైస్ ఎంపిపి సూర్యప్రకాష్, బి.లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : అన్నదాత గోడును వినిపించుకొని ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. ఆదివారం చినమేరంగిలో తన నివాసంలో అన్నదాత పోరు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 9న నియోజకవర్గంలోని పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ఆమె పిలుపునిచ్చారు. ఈ మేరకు కురుపాం, గుమ్మ లక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల రైతులు, కార్యకర్తలు పాలకొండ ఆర్డీవో కార్యాలయంలోనూ, గరుగుబిల్లి, కొమరాడ మండలాలకు చెందిన రైతులు, కార్యకర్తలు పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హాజరై, రైతుల బాధను వినిపించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

ఇద్దరు మృతి, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు

కంటోన్మెంట్ : జామి మండలం అలమండ, భీమాలికి మధ్యలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. లక్క వరపు కోట మండలం భీమాలీకి చెందిన గుల్లిపల్లి సురేష్ (32), జామి మండలం సిరికి పాలానికి చెందిన బోని సాగర్ (24) తో పాటు మిడతాన సూర్య ప్రకాష్ వేర్వేరు బైక్‌లపై తమ స్వంత గ్రామాలకు వెళ్తున్నారు. కొత్తవలస ంచి వస్తున్న కారు ఎదురుగుగా వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలని ఢీకొనడంతో సాగర్, గుల్లిపల్లి సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. సూర్య ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు పక్కన ఉన్న గోడను ఢీకొనడంతో కారు ఎయిర్ బ్యాగ్స్ తెరవడంతో కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. 108 ద్వారా సూర్య ప్రకాష్‌ను విజయనగరం సర్వజన ఆసుపత్రి కి తరలించారు.

కానరాని కందిపప్పు

- రేషన్ షాపులకు సరఫరా లేదు
- ఎప్పుడిస్తార్తో తెలియదు

ప్రజాశక్తి - కురుపాం

ప్రజలు నిత్యం వాడే పౌష్టికాహారంలో కందిపప్పు ఒకటి. ప్రస్తుతం కందిపప్పు ధర ఆకాశాన్నంటిన రోజుల్లోనూ ఖచ్చితంగా ఇంట్లో రెండు, మూడు రోజులకొకసారైనా పప్పు ఉడకవలసిందే. అలాంటి నిత్యవసర సరుకును గత ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వారా అప్పుడప్పుడైనా సరఫరా చేసేది. వివిధ కారణాలతో ఎన్నికలకు కొన్ని నెలల ముందు కందిపప్పు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కంది పప్పు జాడే కనిపించడం లేదు. ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని సందర్భాలు నెలకొన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో కందిపప్పు ధర రూ.118 వరకు ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అందిస్తున్న రేషన్ బియ్యం మోతాదును తగ్గించయినా కందిపప్పు ఇవ్వాలని కోరుతున్నారు. కంది సరఫరా గురించి లబ్దిదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా వారి నుంచి సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కొందరు కార్డు దారులు బియ్యం ఒక్కటి ఇస్తే ఏం చేసుకోవాలి, కుటుంబానికి సరిపడా కందిపప్పు అందించాలని డీలర్లను కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతి ప్రజల ఆవేదనను పరిగణలోకి తీసుకొని రేషన్ దుకాణాల ద్వారా కంది పప్పు సరఫరా చేయాలని కోరుతున్నారు.

కందిపప్పు లేదట..!

రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్ షాపులలో రూ.67కే కందిపప్పు ఇచ్చేవారు. దీనివల్ల కుటుంబానికి ఆసరాగా ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలను ఆదుకోవాలి.

బిడ్డిక వెంకటరావు,
మామిడిమానుగూడ,
నీలకంఠపురం పంచాయతీ.



పేదలకు పంపిణీ చేయాలి

రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. నిత్యవసర సరుకు అయినా కందిపప్పును రేషన్ కార్డుదారులకు అందించడం సర్కారు బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాలకు అందజేసి పేదలకు పంపిణీ చేయాలి.

ఎం. శ్రీనువాసరావు,
సిపిఎం మండల కార్యదర్శి,
కురుపాం.

13 మంది అరెస్టు

సీతానగరం : మండలంలోని పేకాట ఆడుతున్న 13మంది పేకాట రాయుళ్లను ఎస్ఐ ఎం.రాజేష్ తన సిబ్బందితో పట్టుకున్నామన్నారు. ఆయన అందించిన వివరాల ప్రకారం స్థానికులు అందించిన సమాచారం మేరకు గాదెలవలస నుంచి జయంతిరాయిపురం వెళ్లే బట్టి గట్టుపై పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.18,020 స్వాధీనం చేసుకొని వీరిపై కేసు నమోదు చేసుకున్నామన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

పాలకొండ : మండలంలోని లుంబూరు లో అనధికారికంగా విక్రయిస్తున్న ఎనిమిది మద్యం బాటిళ్లను ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ బి.వెంకటరాజు ఆదివారం పట్టుకున్నారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సోదా చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

సీతానగరం + మండలంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ అందించిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం నిడగల్లుకు చెందిన పప్పల సూర్యనారాయణ (58) మరిపివలస రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


మృతి చెందిన సూర్యనారాయణ